నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్ నారాయణపేట

5 | మహబూబ్‌నగర్, మంగళవారం 2 జూలై 2024 | MAHABUBNAGAR NARAYANPET

వనపట్లలో ఆదివారం అర్ధరాత్రి కూలిపడిన ఇల్లు

నిద్రలోనే

తెల్లారిన బతుకులు

- మట్టి మిద్దె కూలి నలుగురు మృతి చెందడంతో భాస్కరుడి జీవితంలో చీకట్లు
- నాగర్‌కర్నూల్ జిల్లా వనపట్లలో విషాదం
- వానకాలంలో కూలుతున్న పాత ఇండ్లు
- ముందస్తు చర్యలు చేపట్టని సర్కారు

నాగర్‌కర్నూల్, జూలై 1 (నమస్తే తెలంగాణ) : అతడి పేరు భాస్కర్.. ప్రపంచానికి వెలుగునిచ్చే సూర్యుడి పేరున్న ఆ వ్యక్తి కుటుంబాన్ని వరుణుడు చీకటిమయం చేశాడు. నలుగురు కుటుంబసభ్యులను కోల్పోయిన ఒంటరి వాడయ్యాడు. నాగర్‌కర్నూల్ మండలం వనపట్లకు చెందిన భాస్కర్ కుటుంబం వరుణుడి ప్రకోపానికి బలి అయ్యింది. ఆదివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి భాస్కర్ తన భార్య, ముగ్గురు పిల్లలను కోల్పోయి ఒంటరిగా మిగిలిపోయాడు.

ఎవరి కోసం బతకాలి..

తన కుటుంబ పోషణ కోసమే రెక్కలు ముక్కలు చేసుకొని కష్టపడుతున్నానని, వాళ్లే లేకుంటే ఎవరి కోసం బతకాలని వనపట్లకు చెందిన ఆటో డ్రైవర్ గొడుకు భాస్కర్ బోరున విలపించాడు. అతడికి ఎకరా పొలం ఉన్నా ఆటో నడుపుతూ ఉపాధి పొందుతున్నాడు. భార్య పద్మమ్మ(28)తోపాటు కూతుళ్లు తేజశ్విని(7), వసంత(5), కొడుకు రిత్విక్(13 నెలలు)తో సంతోషంగా జీవిస్తున్న కుటుంబంలోకి మృత్యువు తొంగి చూసింది. ఆదివారం రాత్రి భార్యా పిల్లలతో కలిసి భోజనం చేసి పడుకున్న వారి జీవితాలు నిద్రలోనే తెల్లారాయి. తమ జీవితంలో ఇదే చీకటి రోజుగా మిగిలిపోతుందని భాస్కర్ గుర్తించలేకపోయాడు. అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి మట్టితో కూడిన మిద్దె కూలిపోయింది. దీంతో కప్పుపై ఉన్న కట్టెలు, మట్టి భార్యాపిల్లలపై పడ్డాయి. దీంతో ఊపిరాడక తల్లి సహా ముగ్గురు పిల్లలు మృతి చెందారు. కాగా భాస్కర్ పక్కన ఫ్రిజ్ ఉండడంతో మట్టి, దూలాలు అతడి మీద పడక పోవడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పెద్ద శబ్దం రావడంతో పక్కనున్న ఇండ్లవాసులు వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. అప్పటికే మట్టిలో కూరుకుపోయి నలుగురు ప్రాణాలు వదిలారు. మృతదేహాలను నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానకు తరలించారు. మంత్రి జూపల్లి సోమవారం ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మట్టిమిద్ద కూలి మృతి చెందిన బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, గాయపడిన భాస్కర్‌కు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి కూలిన ఇంటిని పరిశీలించి అనంతరం చికిత్స పొందుతున్న భాస్కర్‌ను పరామర్శించారు. ఆయనతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ధైర్యం నూరిపోశారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చి తక్షణ సాయంగా రూ.20 వేలు అందజేశారు. కలెక్టర్ సంతోష్ అక్కడికి చేరుకొని భాస్కర్‌ను ఓదార్చారు. భార్యాపిల్లలు మృతి చెందడంతో భాస్కర్ బోరున విలపించాడు. కుటుంబం కోసమే తాను రెక్కలు ముక్కలు చేసుకొని కష్టపడుతున్నానని.. ఇప్పుడు ఎవరి కోసం బతకాలని అతడు ఆవేదన చెందాడు. కాగా ప్రభుత్వ పరంగా మృతుల కుటుంబానికి రూ.4లక్షల ఎక్స్‌గ్రేషియా అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ముందస్తు చర్యలు నిల్

వనపట్లలో ఇల్లు కూలి నలుగురు మృతి చెందగా.. మేలో తాడూరు మండలం ఇంద్రకల్‌లో వర్షానికి ఓ షెడ్డు కూలిన ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురితోపాటు మరొకరు మరణించిన విషయం తెలిసిందే. ఇలా వానకాలంలో పలువురు ప్రాణాలను కోల్పోతున్నారు. ఈ సమయంలో నాయకులు, అధికారులు పరామర్శలకే పరిమితమవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మృతులకు, బాధితులకు ప్రభుత్వం తరపున కనీసం ఆర్థికసాయం కూడా అందడం లేదు. ప్రజాప్రతినిధులు పరిహారం అందిస్తామని ప్రకటనలకే పరిమితమవుతున్నారు తప్పా.. ప్రభుత్వం తరపున ముందస్తు చర్యలు తీసుకోవడం మాత్రం కనిపించడం లేదు. జిల్లావ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో శిథిలావస్థకు చేరిన ఇండ్లు చాలా ఉన్నాయి. బీఆర్ఎస్ హయాంలో పల్లె ప్రగతిలో భాగంగా శిథిలావస్థకు చేరిన ఇండ్లను గుర్తించి కూలగొట్టారు. ప్రస్తుతం అలాంటి ఇండ్ల వివరాలను అధికారులు మాత్రం సేకరించడం లేదు. దీంతో భవిష్యత్తులో మరిన్ని ప్రాణాలు పోయే అవకాశం ఉన్నది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని ప్రజలు కోరుతున్నారు.

గోడ కూలి మృతి చెందిన తల్లి, ముగ్గురు పిల్లలు

దవాఖానలో చికిత్స పొందుతున్న భాస్కర్

పాలమూరులోని మెట్టుగడ్డ వద్ద ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు

నిరుద్యోగుల కన్నెర్ర

- సీఎం రేవంత్ సొంత జిల్లాలో నిరుద్యోగుల నిరసన
- పీయూ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన
- పాలమూరు, గద్వాలలో ర్యాలీలతో గళమెత్తిన అభ్యర్థులు
- జాబ్ క్యాలెండర్ ఎప్పుడని నిలదీత ?
- మెగా డీఎస్సీ వేస్తారా.. లేదా అంటూ ఆగ్రహం ?

సీఎం రేవంత్ సొంత జిల్లాలో నిరుద్యోగులు ఆందోళన బాట పట్టారు. నిత్యం ఏదో ఓ చోట నిరసన తెలియజేస్తున్నారు. వద్దురా నాయనా.. ఈ కాంగ్రెస్ పాలన మాకంటూ నినాదాలతో హోరెత్తిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం మహబూబ్‌నగర్, గద్వాలలో అన్‌ఎంప్లాయీస్ గళమెత్తారు. పెద్ద మొత్తంలో రోడ్డెక్కి ర్యాలీలు నిర్వహించి అనంతరం ధర్నా చేపట్టారు. డీఎస్సీ పోస్టులు పెంచి గ్రూప్-1, 2 సన్నద్ధమయ్యేందుకు సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసలు మెగా డీఎస్సీ ప్రకటిస్తారా..? లేదా..? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా ఇచ్చిన హామీలు అటకెక్కాయని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

– నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

- పాలమూరులో గళమెత్తిన నిరుద్యోగులు
- ప్రిపరేషన్‌కు గడువు ఇవ్వాలని డిమాండ్

పాలమూరు, జూలై 1 : మహబూబ్‌నగర్‌లోని జిల్లా గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రూప్-1 మెయిన్స్ ఎలిజిబిలిటీ 1:100 కు పెంచాలని, గ్రూప్-2లో 2వేలు, గ్రూప్-3లో 3వేల పోస్టులను కలిపి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని.. డీఎస్సీ పోస్టులు పెంచి ప్రిపరేషన్‌కు గడువు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గ్రంథాలయం నుంచి మెట్టుగడ్డ కూడలి వరకు భారీ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా నిరుద్యోగులు మాట్లాడుతూ నిరుద్యోగులపై కాంగ్రెస్ సర్కారు పక్షపాతం చూపుతున్నదని విమర్శించారు. ఎన్నికల వేళ ఓట్ల కోసం మాయమాటలు చెప్పి నిండా ముంచిందని నిరుద్యోగులు వాపోయారు. ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేసిందన్నారు. వద్దురా నాయన.. కాంగ్రెస్ పాలన, గ్రూప్-2, గ్రూప్-3, డీఎస్సీ పోస్టులు పెంచి ప్రిపరేషన్‌కు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. నిరుద్యోగుల తరపున మోతీలాల్‌కు మద్దతుగా ర్యాలీ చేస్తున్నట్లు వారు ప్రకటించారు. మంగళవారం కూడా జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతామని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముమ్మరం చేయాలని కోరారు. కార్యక్రమంలో నిరుద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలమూరులో ర్యాలీ నిర్వహిస్తున్న నిరుద్యోగులు

పీయూ ముఖద్వారం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు, నిరుద్యోగులు

హామీలను నెరవేర్చాలి

- నిరుద్యోగుల జీవితాలతో సర్కారు చెలగాటం
- పీయూ బీఆర్ఎస్వీ కన్వీనర్ భరత్‌బాబు

పాలమూరు, జూలై 1 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని పీయూ బీఆర్ఎస్వీ కన్వీనర్ గడ్డం భరత్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం పాలమూరు విశ్వవిద్యాలయం ప్రధాన ముఖద్వారం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉద్యోగ నియామకాలకు సంబంధించి స్పష్టమైన హామీలిచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాక వంద రోజుల్లో నెరవేరుస్తామని చెప్పి ఏడు నెలలు గడుస్తున్నా హామీలను అమలు చేయడంలేదని.. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నదని మండిపడ్డారు. లక్ష ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి ఇంతవరకు నోటిఫికేషన్ ఇవ్వకపోవడం దౌర్భాగ్యమన్నారు. గ్రూప్-1, మెయిన్స్‌కు 1:100 ప్రకారం ఎంపిక చేయాలని, గ్రూప్-2లో 2వేలు, గ్రూప్-3లో 3వేల పోస్టులు పెంచాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ వేస్తామని చెప్పి నేడు 12వేల పోస్టులు ప్రకటించి నిరుద్యోగులను నిండా ముంచిందని ధ్వజమెత్తారు. వెంటనే 24 వేల పోస్టులతో కూడిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి టీచర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఉస్మానియా జేఏసీ విద్యార్థి మోతీలాల్ ఎనిమిది రోజులుగా నిరాహారదీక్ష చేస్తుంటే ప్రభుత్వం స్పందించక పోడం దారుణమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గాంధీ దవాఖానకు వెళ్లి మోతీలాల్ చేత దీక్షను విరమింపజేయాలని కోరారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు రమేశ్, ఆంజనేయులు, రాఘవేంద్ర, నవీన్‌గౌడ్, సాయి, కుమార్, ప్రవీణ్, శ్రీకాంత్, మౌనిక, మమత, నిరుద్యోగులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ నిర్వహించాలి

జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన నిరుద్యోగులు

- గద్వాలలో నిరుద్యోగుల ఆందోళన

గద్వాల, జూలై 1 : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి మెగా డీఎస్సీ నిర్వహించాలని కోరుతూ సోమవారం గద్వాలలో నిరుద్యోగులు ర్యాలీ నిర్వహించారు. కృష్ణవేణి చౌరస్తా నుంచి ర్యాలీ మొదలై కలెక్టరేట్‌కు చేరుకొని అక్కడే ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నిరుద్యోగ సంఘం నాయకులు చంద్రశేఖర్, సైదన్న, శివరాం, వీరేశ్ మాట్లాడారు. అధికారంలోకి వస్తే నిరుద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని.. మెగా డీఎస్సీతో టీచర్ల పోస్టులు భర్తీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ హామీల అమలులో విఫలమైందన్నారు. ప్రమోషన్ల ద్వారా జిల్లాలో కొత్తగా ఏర్పడిన ఉపాధ్యాయ ఖాళీలను 2023 పాత డీఎస్సీలో కలిపి పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. జూన్‌లో టెట్ ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులను దృష్టిలో ఉంచుకొని వారికి సమయం కేటాయిస్తూ డీఎస్సీని వాయిదా వేయాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ సంతోష్‌కు అందజేశారు. కార్యక్రమంలో నిరుద్యోగులు సునీల్, అశోక్, నర్సింహ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

గద్వాలలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నిరుద్యోగులు

జెడ్పీ వ్యవస్థ బలోపేతానికి కృషి

- ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు
- జిల్లా పరిషత్ సభ్యుల వీడ్కోలు సమావేశం

నాగర్‌కర్నూల్, జూలై 1 : ప్రజాస్వామ్యంలో గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ వ్యవస్థలను పటిష్టం చేసేలా నిధులు ఇచ్చి బలోపేతం చేస్తేనే వాటికి సార్థకత ఉంటుందని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్యుల వీడ్కోలు సమావేశానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారితోపాటు సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలతో ఎన్నుకున్న వ్యవస్థలు కీలకంగా పనిచేయాలంటే అందుకు తగ్గట్టే అధికారులు, నిధులు ఉండాలని, ప్రజా ప్రభుత్వంలో ఇవి ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జెడ్పీటీసీ శాంతకుమారి మాట్లాడుతూ చిన్న వయసులోనే జెడ్పీ చైర్‌పర్సన్‌గా సేవ చేసే భాగ్యాన్ని ఇచ్చిన ఊరుకొండ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాలన సజావుగా అందించేందుకు సహకరించిన జెడ్పీటీసీలకు ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ బాలాజీసింగ్, జెడ్పీ సీఈవో గోపాల్‌నాయక్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

నాగర్‌కర్నూల్‌లో వీడ్కోలు సమావేశంలో సభ్యులతో మంత్రి జూపల్లి కృష్ణారావు

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ విజయేందిరబోయి

దేవరకద్ర, జూలై 1 : కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పరిధిలోని పెండింగ్ కాల్వ పనులు వెంటనే పూర్తి చేయాలని ప్రాజెక్టు అధికారులకు కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. సోమవారం కోయిల్‌సాగర్ ప్రాజెక్టును ఆమె సందర్శించి నీటి సామర్థ్యంతోపాటు క్రేజీకల్చర్ చేపల పెంపకం తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కుడి, ఎడమ కాల్వల కింద పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్‌ను ఆదేశించారు. ప్రాజెక్టుపై మంగళవారం సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం తాసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి ధరణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తాసీల్దార్ శ్రీనివాసులుకు సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో గృహజ్యోతి లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్ నమోదు గురించి అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలోని వార్డులను పరిశీలించి అందిస్తున్న వైద్య సేవలు, మందుల కొరత ఉందా అని వైద్యుడు శరత్‌చంద్రను అడిగి తెలుకున్నారు.

కోయిల్‌సాగర్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

బీఆర్ఎస్‌తోనే నా ప్రయాణం

- ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి
- మంచి చేస్తే చరిత్రలో నిలిచిపోతారు
- గులాబీ పార్టీ రాష్ట్ర నేత ఆర్ఎస్పీ
- ఆమనగల్‌లో ఆత్మీయ సన్మానం

కల్వకుర్తి, జూలై 1 : ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా తన ప్రయాణం బీఆర్ఎస్‌తోనేనని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాసేవ చేసేందుకు రాజకీయాలు ఒక మార్గమని.. ప్రజలకు మంచి చేసిన నాయకులకు చరిత్రలో ఖచ్చితంగా ఒక పేజీ ఉంటుందని.. అందులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిరస్థాయిగా నిలిచిపోతారని ఆయన పేర్కొన్నారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆమనగల్లులోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు సోమవారం ఆత్మీయ సన్మానం నిర్వహించారు. చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్పీ, తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్సీగా గెలుపొందిన నవీన్‌కుమార్‌రెడ్డిని వారు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు సేవా పురస్కారాలను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాప్రతినిధులకు గౌరవవేతనాలు నిలుపుదల చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో ఉండటంతోనే సీఎం రేవంత్‌రెడ్డి నీచమైన సంస్కృతికి తెరలేపారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ ఆయన వెంటే ఉంటానని పునరుద్ఘాటించారు. ఎమ్మెల్సీగా పోటీ నుంచి తప్పుకుంటే కాంగ్రెస్ పార్టీ తనకు రూ.30కోట్లతో పాటు కార్పొరేషన్ పదవి ఇస్తామని ప్రలోభాలకు గురిచేసిందని గుర్తు చేశారు. సీఎం సొంత జిల్లాలోనే తాను బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా గెలవడం రేవంత్‌రెడ్డికి చెంపపెట్టులాంటిదని ఎద్దేవా చేశారు.. ఈ సందర్భంగా తనను గెలిపించిన పాలమూరు ప్రజాప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వెంకటేశ్ తన ట్రస్టు ద్వారా చేస్తున్న సేవలు అభినందనీయమని.. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని ఆయన ఆకాంక్షించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కలిసికట్టుగా ముందుకు సాగుదామని ఆర్ఎస్పీ పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తకు అండగా ఉంటానని వెంకటేశ్ భరోసానిచ్చారు. వచ్చే కాలం బీఆర్ఎస్‌దేనని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచూపుదామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు అనురాధ, దశరథ్‌నాయక్, ఎంపీపీలు నిర్మల, మనోహర, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీబీ డ్యాంకు వరద

అయిజ, జూలై 1 : కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు వరద క్రమంగా పెరుగుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాలకు తుంగ జలాశయం నిండటంతో దిగువనున్న టీబీ డ్యాంకు వరద పోటెత్తుతున్నది. డ్యాంలోకి సోమవారం 12,735 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్ ఫ్లో 296 క్యూసెక్కులుగా నమోదైంది. డ్యాం సామర్థ్యం 105.855 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.782 టీఎంసీల నిల్వ ఉన్నది. 1633 అడుగులకు గానూ 1,584.15 అడుగులకు నీటి మట్టం చేరినట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు. డ్యాంలోకి వరద చేరికతో నదీతీర ప్రాంత రైతులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వైద్యులు పునర్జన్మ ప్రదాతలు

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- వైద్యులకు సన్మానం

వనపర్తి, జూలై 1 : వైద్యులంటే.. పునర్జన్మనిచ్చే ప్రదాతలని, వారిని గౌరవించుకోవడం అందరి బాధ్యతని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం వైద్యుల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రజావైద్యశాలలో డాక్టర్లు మురళీధర్, శారదతోపాటు పలువురిని నిరంజన్‌రెడ్డి సన్మానించారు. అదేవిధంగా బాలకిష్టయ్య విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడారు. వైద్యులు ప్రత్యక్ష దైవంతో సమానమని, రోగుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపి వారి ఆరోగ్యాన్ని మెరుగు పర్చుతారన్నారు. నియోజకవర్గంలో వైద్య సేవలు అందుబాటులోని లేని సమయంలో డాక్టర్ బాలకిష్టయ్య ప్రజలకు విశేష సేవలందించారన్నారు. అలాగే ఉద్యోగ విరమణ సందర్భంగా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యుగంధర్‌రెడ్డి, శ్రీదేవి దంపతులను సన్మానించారు. ఉద్యోగ విరమణ అనంతరం సమాజ సేవకు అంకితం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జాత్రునాయక్, అశోక్, నాగన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యులను సన్మానిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్‌లో వీడ్కోలు సమావేశంలో సభ్యులతో మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజాదరణ ఉంటే గెలుపు మన వెంటే..

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

జెడ్పీటీసీ, ఎంపీటీసీలతో గద్వాల ఎమ్మెల్యే బండ్ల

గట్టు, జూలై 1 : ప్రజల ఆదరణ ఉంటే గెలుపు ఎప్పుడూ మనవైపే ఉంటుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. మండల మహిళా సమాఖ్య భవనంలోని మీటింగ్ హాల్‌లో సోమవారం మండల సర్వసభ్య సమావేశం, ఎంపీటీసీలకు వీడ్కోలు సభ నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నా తాము అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని.. దీన్ని మరింత వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. గట్టు మండలానికి ఎంపీపీ, జడ్పీటీసీ లేకపోవడంతో ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఎంపీడీవో, ఎంపీవో, ఏపీవోలు ఎంపీటీసీలకు సహకరించాలన్నారు. ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ బాసు శ్యామల, వైస్ ఎంపీపీ మేకల సుమతి, పీఏసీసీఎస్ చైర్మన్ క్యామ వెంకటేశ్, ఐసీడీఎస్ సీడీపీవో కమలాదేవి, బీఆర్ఎస్ నాయకులు జంబు రామన్‌గౌడ్, బాసు హనుమంతు, అంగడి బస్వరాజు, ఆనంద్‌గౌడ్, రామకృష్ణారెడ్డి, రామునాయుడు పాల్గొన్నారు.